సాక్షి కామారెడ్డి

ఆదివారం । 23 । జూన్ । 2024



పది రోజులైనా పస్తులేనా..!

సదాశివనగర్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మధ్యాహ్నం భోజనం లేక విద్యార్థులు పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొంది.

- 8లో ▸



పాడి రైతుల ధర్నా

కామారెడ్డి పట్టణ పరిధిలోని పాత రాజంపేట శివారులో గల విజయ డెయిరీ వద్ద పాడి రైతులు ఆందోళన చేపట్టారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.7 /23.1

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమవుతుంది. పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

సిటీని వదిలి.. సొంతూరుకు కదిలి..

వారంతా డిగ్రీలు, పీజీలు చేసిన ఉన్నత విద్యావంతులు. ఉద్యోగాల కోసం నగరాలకు వలస బాట పట్టారు. తాము చదువుకున్న విద్యకు అనుగుణంగా ఉద్యోగాలు నిర్వహిస్తున్నా ఏదో కోల్పోయిన అసంతృప్తి. దీనికి తోడు కరోనా మహమ్మారి కారణంగా ఎంతో మంది యువత నగరాల్లో ఉద్యోగాలు కోల్పోయారు. దీంతో సొంతూరికి పయనమయ్యారు. పరిస్థితి చక్కబడిన తర్వాత కొందరు తిరిగి సిటీకి వెళ్లినా.. చాలా మంది ఉన్న ఊళ్లోనే ఉపాధి పొందుతున్నారు. జనాల అభిరుచిని గమనించి ఫుడ్ బిజినెస్‌లు స్థాపించి సక్సెస్ అయ్యారు. తాము ఉపాధి పొందడమే కాకుండా నలుగురికి పని కల్పిస్తున్నామనే ఆత్మసంతృప్తితో జీవిస్తున్నారు.

- ఉన్న ఊళ్లోనే స్వయం ఉపాధి
- ప్రజల టేస్టుకు తగట్టు ఫుడ్ బిజినెస్‌ల ఏర్పాటు
- తమతో పాటు నలుగురికి పని కల్పిస్తూ..
- ఆదర్శంగా నిలుస్తున్న యువతరం



కామారెడ్డి పట్టణంలో ఓ యువకుడు నడుపుతున్న మిల్లెట్ టిఫిన్ సెంటర్

సండే స్పెషల్

సాక్షి, కామారెడ్డి: ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కరోనా మహమ్మారి మూలంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దెబ్బతిని ఎంతో మంది రోడ్డున పడాల్సి వచ్చింది. కొందరు తిరిగి ఉద్యోగాల్లో చేరగా మరెందరో సొంతూళ్లలో ఏదో ఒక ఉపాధి వెతుక్కున్నారు. కొందరు వినూత్నంగా ఆలోచించి కొత్త రంగాలను ఎంచుకున్నారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా నూతన వ్యాపారాలు మొదలుపెట్టారు. ప్రజల ఆహారపు అలవాట్లు, అవసరాలు వేదికగా కరోనా సృష్టించిన కొత్త అవకాశాలను అందిపుచ్చుకుని స్వయం ఉపాధి పొందుతూ మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నారు. కరోనా తర్వాత ఆహార విక్రయాలు పెరిగాయని గుర్తించి ఎక్కువ మంది ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బిర్యానీ పాయింట్లు, మిల్లెట్స్‌తో టిఫిన్స్ వంటి సెంటర్లు ఏర్పాటు చేసుకున్నారు. కొందరు ప్రత్యేక వ్యాన్లు తయారు చేయించుకుని ఏదో ఒకచోట వాహనాన్ని నిలిపి అక్కడ ఉదయం టిఫిన్స్, సాయంత్రం స్నాక్స్ దందా నడిపిస్తున్నారు. ఇంకొందరు కార్పొరేట్ స్టైల్‌లో టీ పాయింట్స్ ఏర్పాటు చేసుకుంటున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని ఎల్లారెడ్డి, బాన్సువాడ పట్టణాలు, మండల కేంద్రాలే కాదు, మారుమూల గ్రామాల్లోనూ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. మరికొందరు నోరూరించే బిర్యానీలు కూడా తయారుచేసి ఉపాధి పొందుతున్నారు. పట్టణాలే కాదు మారుమూల గ్రామాలు, తండాల్లో సైతం రకరకాల ఫుడ్ కోర్టులు ఏర్పాటయ్యాయి. అందులో చాలామంది కరోనాతో ఉపాధి కోల్పోయినవారే ఉన్నారు. మరికొందరు పట్టణాలు, నగరాలకు వెళ్లి అక్కడ సంపాదించేది ఇంటి అద్దెలు, ఖర్చులకు సరిపోవనే భావనతో సొంతూరిలో సొంతంగా టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఏర్పాటు చేసుకుంటున్నారు.

మిల్లెట్ టిఫిన్ సెంటర్‌తో ఉపాధి..



కామారెడ్డి పట్టణానికి చెందిన ఆకుల అజయ్ యాదవ్ ఎంబీఏ చదివారు. రెండేళ్ల పాటు ఐటీ ఉద్యోగం చేశారు. తర్వాత సొంతూరిలో మిల్లెట్స్‌తో టిఫిన్స్ తయారు చేసి, ఆరోగ్యకరమైన ఆహారం అందించాలని నిర్ణయించుకున్నాడు. పట్టణంలోని విద్యానగర్‌లో ఆయుష్మాన్ భవ మిల్లెట్ డైట్, హెల్తీ డైట్ పేరిట టిఫిన్ సెంటర్ ప్రారంభించారు. మొదట్లో ప్రజలు మిల్లెట్ టిఫిన్స్ అంటే పెద్దగా ఆసక్తి చూపలేదని, రానురాను అందరూ అలవాటుపడి రెగ్యులర్‌గా వచ్చి తింటున్నారని అజయ్ అంటున్నారు. తన టిఫిన్ సెంటర్‌లో ఇప్పుడు 12 మందికి ఉపాధి కల్పించారు. సిరిధాన్యాలతో ఇడ్లీ, దోశ, వడ, ఉప్మాతో పాటు రాగి అంబలి తయారు చేస్తున్నారు. ఇదే సెంటర్‌లో అజయ్ బావమరిది మంచాల ప్రశాంత్ యాదవ్ మధ్యాహ్నం, సాయంత్రం వేళలో ప్రత్యేకమైన బియ్యంతో రూ. వందకే కడుపునిండా భోజనం అందిస్తున్నారు.

స్టార్ హోటల్ వద్దనుకుని సొంత వ్యాపారం



కామారెడ్డి పట్టణానికి చెందిన సాయిరాం, రాహుల్ గంభీర్‌లు వరుసకు సోదరులు. ఇద్దరూ హోటల్ మేనేజ్‌మెంట్ ఫుడ్ ఇండస్ట్రీ కోర్సు చదివారు. దేశ వాణిజ్య రాజధానిలోని తాజ్ ముంబయిలో ఉన్నతస్థాయి ఉద్యోగం చేశారు. కరోనా తర్వాత సొంతంగా ఏదైనా చేయాలన్న ఆలోచనతో కామారెడ్డికి చేరుకుని క్వాలిటీతో కూడినవి ఇవ్వాలనుకున్నారు. పట్టణంలోని విద్యానగర్‌లో హర్ష కేక్స్ అండ్ బేకర్స్ పేరుతో ఏర్పాటు చేసి, ఇప్పుడు మరో ఎనిమిది మందికి ఉపాధి కల్పిస్తున్నారు. చదువుతో నేర్చుకున్న దాన్ని ఆచరణలో చూపారు. కేక్స్ తయారీలో పేరు సంపాదించారు. బాగా గిరాకీ ఉంది. అప్పుడు సంపాదించిన దానికన్నా రెండింతలు ఎక్కువే సంపాదిస్తున్నామని వారు పేర్కొన్నారు. దానికితోడు ఇంటి దగ్గర అమ్మానాన్నలతో కలిసి ఉండడం, కొందరికి ఉపాధి చూపడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

ప్రైవేటు స్కూల్‌లో ఉద్యోగం మానేసి..



ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన అజయ్ డిగ్రీ తర్వాత వ్యాయామ ఉపాధ్యాయ కోర్సు పూర్తి చేశాడు. కరోనా కంటే ముందు హైదరాబాద్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేశాను. కరోనా తర్వాత ఇతర ఉద్యోగాల్లో చేరాడు. ఆయా సంస్థల ఒత్తిడి ఎక్కువగా ఉండడంతో ఉద్యోగం మానేసి సొంతూరికి వచ్చేశా. ఎల్లారెడ్డిలో జైదుర్గా భవానీ టిఫిన్ సెంటర్ పెట్టుకున్నాను. వ్యాపారం బాగా నడుస్తోంది. ఏ ఇబ్బంది లేకుండా సొంత ఊరిలో నా కాళ్ల మీద నేను బతకగలుగుతున్నానని ఆయన వివరించారు. కష్టపడి పనిచేస్తే ఏ రంగంలోనైనా రాణించవచ్చని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి



భిక్కనూరు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ సూచించారు. భిక్కనూరు మండలం జంగంపల్లిలోని అమ్మ ఆదర్శ పాఠశాలను శనివారం సందర్శించారు. ఇటీవల పాఠశాలలో చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందని వీటితో అభివృద్ధి పనులు నాణ్యతగా చేపట్టాలన్నారు. ఆయన వెంట పంచాయతీరాజ్ డీఈ సోహెల్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ గాలిరెడ్డి, హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

జనరల్ ఆస్పత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే కేవీఆర్

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్యశ్రీ విభాగంలో రికార్డులను పరిశీలించారు. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ విజయలక్ష్మి, ఆర్‌ఎంవో శ్రీనివాస్‌లతో సమస్యలపై చర్చించారు. ఆస్పత్రి ఆవరణలో తన సొంత డబ్బుతో పోలీస్ కంట్రోల్ రూం వద్ద, మూడో గేటు పక్కన నిర్మించిన నూతన రేకుల షెడ్లను పరిశీలించారు. వీటిని రోగులకు ఉపయోగపడేలా చూడాలని సూచించారు.

అదనపు ఎస్పీకి సేవా పథకం..

- జిల్లాకు చెందిన తొమ్మిది మందికి అవార్డులు



కామారెడ్డి క్రైం : విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన పోలీసు అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం శనివారం సాయంత్రం ప్రకటించిన పథకాల్లో కామారెడ్డి జిల్లాకు మొత్తం తొమ్మిది అవార్డులు దక్కాయి. జిల్లా అడిషనల్ ఎస్పీ నరసింహా రెడ్డితో పాటు స్పెషల్ బ్రాంచ్‌లో సీఐగా పని చేస్తున్న ఎం.జార్జ్, పెద్ద కొడప్గల్ ఎస్సై కోనారెడ్డి, కామారెడ్డి టౌన్ ఎస్సై తాజుద్దీన్, ఏఎస్‌ఐ నర్సయ్య, హెడ్‌కానిస్టేబుళ్లు హైమద్, నర్సింలు, హన్మాండ్లు, సాయి రెడ్డి ప్రతిష్టాత్మక సేవా పథకాలకు ఎంపికయ్యారు.

29న స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపికలు

కామారెడ్డి అర్బన్: హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో నాల్గో తరగతి ప్రవేశాలకు మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు ఈనెల 29న ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు యువజన క్రీడల జిల్లా అధికారి వై.దామోదర్‌రెడ్డి తెలిపారు. కామారెడ్డి ఇందిరాగాంధీ స్టేడియంలో ఉదయం తొమ్మిది గంటలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు 2015 సెప్టెంబర్ 1 నుంచి 2016 ఆగస్టు 31వ తేదీలోపు జన్మించిన విద్యార్థులు ప్రవేశాలకు అర్హులన్నారు. పూర్తి వివరాలకు 94440292793, 9618126053 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

సెంట్రల్ లైటింగ్ ప్రారంభించేలా చూస్తాం

- మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ



సాక్షి ఎఫెక్ట్..

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ రోడ్, దేవునిపల్లి వద్ద సెంట్రల్ లైటింగ్ ప్రారంభించేలా చూస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, కమిషనర్ సుజాత తెలిపారు. పనులు పూర్తయి ఏడాది గడుస్తున్నా బల్దియా అధికారులు పట్టించుకోవడం లేదని.. 'సాక్షి' దినపత్రికలో శనివారం ప్రచురితమైన 'వెలుగులివ్వని సెంట్రల్ లైటింగ్' వార్తకు స్పందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్‌లు విద్యుత్ దీపాలను పరిశీలించారు. తక్షణమే విద్యుత్ కనెక్షన్ ఇచ్చి వెలుగులు వచ్చేలా చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉర్దొండ వనిత, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉండాలి



- కార్యకర్తలు అధైర్యపడొద్దు.. అండగా ఉంటా..
- మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి

బాన్సువాడ: పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయానికి ప్రతిఒక్కరూ కట్టుబడి ఉండాలని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి వచ్చిన ఆయనకు బాన్సువాడలో కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆయన కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా కార్యకర్తలు మాట్లాడుతూ 'మీరు బాన్సువాడ నుంచి వెళ్లిపోతే ప్రాణత్యాగాలకైనా సిద్ధంగా ఉన్నామని, బాన్సువాడ వదిలి వెళ్లొద్దని' మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి ముందు వాపోయారు. కాంగ్రెస్‌లో అధిష్టానం తీసుకున్న నిర్ణయానికి ప్రతి కార్యకర్త కట్టుబడి ఉండాలని రవీందర్ రెడ్డి సూచించారు. అధిష్టానం నిర్ణయం తీసుకునే క్రమంలో కార్యకర్తల అభిప్రాయాలు కూడా తీసుకుని ఉండాల్సిందన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల భయంతోనే బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి హస్తం పార్టీలో చేరారని, కార్యకర్తలు అధైర్య పడొద్దని.. తాను ఇక్కడే ఉంటూ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పోచారం పార్టీలోకి రాగానే ఆయన అనుచరులు కాంగ్రెస్ కార్యకర్తలపై దాడులకు దిగుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాసాని శ్రీనివాస్‌రెడ్డి, కొత్తకొండ భాస్కర్, బాపురెడ్డి, బస్వరాజ్, పుప్పల శంకర్, శేఖర్‌రెడ్డి, మంత్రి గణేశ్, అఫ్రోజ్, చందురెడ్డి, నార్ల రఘు, ప్రతాప్‌సింగ్, మధుసూదన్‌రెడ్డి, అక్బర్, పాత బాలకృష్ణ, లయక్, వీర్రాజు, కిషోర్‌యాదవ్, రుక్మిణి, రమాదేవి, అంజాద్‌ఖాన్, విఠల్ పాల్గొన్నారు.

'కొండ పోచమ్మ'తో సాగుకు భరోసా

- వర్షాలు కురవకపోయినా నీరిచ్చేలా ప్రణాళిక
- వానాకాలం పంటల సాగుకు 'సాగర్' జలాలు
- నేటి నుంచి ప్రధాన కాలువకు నీటి విడుదల



నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం

నిజాంసాగర్(జుక్కల్): ఉమ్మడి జిల్లా వరప్రదాయని నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ కింద వానాకాలం పంటల సాగుకు 'కొండ పోచమ్మ' కొండంత భరోసాగా నిలవనుంది. ప్రాజెక్టు ఆయకట్టు కింద 1.15 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్న పంటలు గట్టెక్కాలంటే 10 టీఎంసీల జలాలు అవసరం. అయితే ప్రస్తుతం నిజాంసాగర్ ప్రాజెక్టులో 4.3 టీఎంసీల నీరు మాత్రం నిల్వ ఉంది. ఆయకట్టు పంటలు గట్టెక్కించేందుకు కొండపోచమ్మ సాగర్ నుంచి 4.9 టీఎంసీల నీటి విడుదలకు గ్రీన్‌సిగ్నల్ లభించినట్లు నీటి పారుదలశాఖ అధికార వర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుతం కొండ పోచమ్మసాగర్ రిజర్వాయర్‌లో 14 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. అయితే నిజాంసాగర్ ఆయకట్టు పంటల అవసరాల మేరకు కొండపోచమ్మ రిజర్వాయర్ నీటి విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలం వ్యక్తం చేసింది. వర్షాలు కురవకపోయినా కొండ పోచమ్మ నీటితో నిజాంసాగర్ ఆయకట్టు పంటలను కాపాడనున్నారు.

రెండు విడతల్లో 2.9 టీఎంసీలు..

నిజాంసాగర్ ఆయకట్టు కింద వానాకాలం పంటల సాగు అవసరాల కోసం ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు రెండు విడతల్లో 2.9 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నారు. ప్రస్తుతం నిజాంసాగర్ ప్రాజెక్టులో 4.3 టీఎంసీల నీరు నిల్వ ఉన్నందున ముందుగా రెండు విడతల్లో ప్రధాన కాలువకు నీరు విడుదల చేస్తారు. అప్పటి వరకు వర్షాలు కురవకపోతే కొండ పోచమ్మ సాగర్ ద్వారా 4.9 టీఎంసీల నీటిని తీసుకువచ్చి మిగతా నాలుగు విడతల్లో ఆయకట్టు పంటలను గట్టెక్కించేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

నీటి విడుదలను ప్రారంభించనున్న ఎమ్మెల్యేలు

నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు ఆదివారం ఉదయం 9 గంటలకు నీటిని విడుదల చేయనున్నారు. జుక్కల్, బాన్సువాడ ఎమ్మెల్యేలు తోట లక్ష్మీకాంతారావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డిల చేతుల మీదుగా నీటిని విడుదలను ప్రారంభించనున్నారు.

నిబంధనలు తూచ్..!

- ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల ఇష్టారాజ్యం
- అధిక ఫీజుల వసూలు
- యథేచ్ఛగా బుక్స్, యూనిఫాంల విక్రయం
- అందినకాడికి దండుకుంటున్న యాజమాన్యాలు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



పట్టణంలోని ఓ స్కూల్‌లో విక్రయిస్తున్న బుక్కులు

కామారెడ్డి టౌన్: జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలు కనీస నిబంధనలు పాటించడంలేదు. ఒకవైపు అధిక ఫీజులు వసూలు చేస్తుండడమే కాకుండా.. మరోవైపు స్కూల్ యూనిఫాంలు, పాఠ్య, నోట్ పుస్తకాలు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాయి. నిర్వాహకులు తమ స్కూల్‌లోనే అన్నీ కొనుగోలు చేయాలని చెబుతున్నారు. అలా కాదని బుక్స్ బయట కొందామని అనుకున్నా.. ఎక్కడా లభ్యం దొరకవు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు చేసేదేమీ లేక పాఠశాల్లోనే కొనుగోలు చేస్తున్నారు. తరగతుల ఆధారంగా కేవలం పుస్తకాలకే సుమారు రూ. 15 వందల నుంచి రూ. 5 వేల వరకు వసూలు చేస్తున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇవే కాకుండా యూనిఫాంలు, బ్యాగులు, షూలు, టై, బెల్టులు తదితర వాటిని కూడా అమ్ముతున్నారు. జిల్లాలోని అత్యధిక ప్రైవేట్ స్కూళ్లలో ఇదే వ్యాపారం సాగిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. బహిరంగంగా ఈ వ్యాపారం జరుగుతున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం.

మైదానాలు, మౌలిక వసతులు కరువు

జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ముందు ఓ కార్పొరేట్ స్కూల్, గోదాంరోడ్‌లో మరో స్కూల్ ఇలా చాలా స్కూళ్లకు క్రీడా మైదానాలు లేవు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలతో పాటు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

వామ్మో ఇవేం ఫీజులు..

జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు 300లకు పైగా ఉన్నాయి. ప్రైవేట్ స్కూళ్లలో నర్సరీకి స్కూల్ ఫీజు రూ. 20 వేల నుంచి 30వేల వరకు, కార్పొరేట్ స్కూళ్లలో రూ. 40 నుంచి 50 వేలకు పైగా వసూళ్లు చేస్తున్నారు. ప్రైమరీ, హైస్కూళ్లకు రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకు నిబంధలకు విరుద్ధంగా ఫీజులు తీసుకుంటున్నారు. అంతేకాకుండా బస్సు ఫీజు, కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, ఐఐటీ, నీట్ తరగతులు, పరీక్ష తదితర ఫీజులంటూ అదనంగా బాదుతున్నారు. నింబధనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ నిర్ణయించిన ఫీజునే తీసుకోవాల్సి ఉన్నా.. ఇవేమీ పట్టించుకోవడంలేదు.

కఠిన చర్యలు తీసుకుంటాం



పాఠశాలల ఆవరణలో ఎట్టి పరిస్థితుల్లో పుస్తకాలు ఇతరత్రా వస్తువులను విక్రయించరాదు. అధిక ఫీజులు వసూళ్లు చేయొద్దు. అలా చేస్తే చర్యలు తప్పవు. రాతపూర్వకంగా బడుల్లో జరుగుతున్న వ్యాపారంపై ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. – ఎస్ రాజు, డీఈవో, కామారెడ్డి

అల్పాహారంలో బల్లి

- తెయూ బాలికల హాస్టల్‌లో ఘటన
- ఆలస్యంగా వెలుగు చూసిన వైనం
- వంట మనిషి సస్పెన్షన్



వెజ్ బిర్యానీలో వచ్చిన బల్లి

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ వర్సిటీ బాలికల వసతి గృహంలో అల్పాహారంలో బల్లి వచ్చింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి విద్యార్థినులు తెలిపిన వివరాలు.. శుక్రవారం ఉదయం టిఫిన్ కోసం వెజ్‌బిర్యానీ వండారు. ఒక విద్యార్థిని టిఫిన్ చేస్తుండగా వెజ్ బిర్యానీలో బల్లి కన్పించింది. ఆందోళనకు గురైన ఆమె మిగిలిన వారికి ఈ విషయం తెలిపింది. ఘటనపై హాస్టల్స్ చీఫ్ వార్డెన్ మహేందర్‌రెడ్డికి సమాచారం ఇవ్వగా తాను ప్రస్తుతం స్థానికంగా లేనని తర్వాత చూద్దామని చెప్పారు. హాస్టల్ వార్డెన్ కిరణ్మయి, కేర్‌టేకర్ జమున సైతం నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు విద్యార్థినులు పేర్కొన్నారు. అప్పటికే సుమారు 120 మంది వరకు టిఫిన్ తిన్నారు. వారంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కొంత సేపటికి విషయం తెలిసిన వర్సిటీ అధికారులు కొందరు ఈ విషయాన్ని బయటకు చెప్పవద్దని ఒత్తిడి చేసినట్లు విద్యార్థినులు ఆరోపించారు. టిఫిన్‌లో బల్లి వచ్చిన తెలిసిన కొందరు విద్యార్థి సంఘాల నాయకులు సైతం వర్సిటీ అధికారులతో కలిసి విషయం బయటకు రాకుండా చూడాలని యత్నించినట్లు తెలిసింది. అయితే రాత్రికి ఒకరిద్దరు విద్యార్థి సంఘాల నాయకులు ఈ విషయాన్ని రిజిస్ట్రార్ యాదగిరి దృష్టికి తీసుకెళ్లారు. ఘటనపై వంట మనిషి రాజేష్‌ను సస్పెండ్ చేసినట్లు రిజిస్ట్రార్ చెప్పడంతో వారు మిన్నకుండి పోయారు. శనివారం ఉదయం ఈ విషయం క్యాంపస్‌లో చర్చనీయాంశమైంది.

బల్లి కాదు.. కీటకం

బాలికల హాస్టల్‌లో చేసిన టిఫిన్‌లో బల్లి వచ్చిందని సమాచారం వచ్చింది. వెంటనే హాస్టల్ వార్డెన్, కేర్‌టేకర్‌ను అప్రమత్తం చేశాను. టిఫిన్ పడేసి మిగిలిన వారికి తాజాగా వంట చేసి అందించారు. ఘటనపై వార్డెన్, కేర్‌టేకర్ విచారణ జరిపి సాయంత్రం నివేదిక అందజేశారు. వెజ్ బిర్యానీలో వచ్చింది బల్లి కాదు.. ఏదో కీటకం. హెడ్ కుక్ రాజేశ్‌ను విధుల నుంచి తొలగించాం. – యాదగిరి, రిజిస్ట్రార్

క్లుప్తంగా

జీవితమంతా బీఆర్‌ఎస్‌లోనే..



నిజాంసాగర్(జుక్కల్) : తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన పితామహుడు కేసీఆర్‌ను, బీఆర్‌ఎస్ పార్టీని వీడే ప్రసక్తి లేదని, సచ్చినా, బతికినా బీఆర్‌ఎస్ పార్టీలోనే ఉంటానని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే తేల్చి చెప్పారు. అధికారంలో లేదని ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తాను మాత్రం బీఆర్ఎస్ పార్టీని వీడనని స్పష్టం చేశారు. శనివారం మండలంలోని మల్లూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ బాధిత కుటుం బాలకు ప్రమాదబీమా చెక్కులను అందజేశారు. మాజీ జెడ్పీచైర్మన్ దఫేదార్ రాజు, నాయకులు దుర్గారెడ్డి, గైని. విఠల్, విఠల్‌రెడ్డి తదితరులున్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : గిరిజన గురుకుల బాలుర పాఠశాలను ఎంపీపీ పాల్త్య విఠల్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రతి రోజు పిల్లలకు పప్పు మాత్రమే వండుతున్నారని పిల్లలు చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడటానికి ప్రయత్నించగా అందుబాటులో లేకపోవడంతో ప్రతి రోజు మెనూ ప్రకారం ఎందుకు పెట్టడం లేదని ఆగ్రహించారు. దీనితో ప్రిన్సిపాల్ ప్రవీణ్ మెనూ ప్రకారం కూరగాయలు పంపడం లేదని తెలిపారు. ఉన్నతాధికారులకు నివేదించి త్వరగా విద్యార్థులకు మెనూ ప్రకారం అందించాలన్నారు. అంతేకాకుండా ప్రాంగణంలో పిచ్చి మొక్కలు మొలిచాయని వెంటనే తొలగించాలన్నారు. ఎంఈడీవో నీలావతి, ఎంపీవో రాము, బిఆర్‌ఎస్ పార్టి మండల అధ్యక్షులు పెర్క శ్రీనివాస్,ప్రతాస్,రాము తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



బాన్సువాడ రూరల్ : పౌరులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బాన్సువాడ కోర్టు జడ్జి భార్గవి సూచించారు. శనివారం మండలంలోని తాడ్కోల్ జీపీలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ప్రజలు డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బషీరొద్దీన్, జీపీ కార్యదర్శి ప్రశాంతి, న్యాయవాదులు ఖలీల్, లక్ష్మీ నారాయణ, మూర్తి,గ్రామస్తులు పాల్గొన్నారు.

పది రోజులైనా పస్తులేనా..!

- మోడల్ స్కూల్‌లో ప్రారంభం కాని మధ్యాహ్నభోజనం
- విద్యార్థులకు ఇబ్బందులు



సదాశివనగర్‌లోని మోడల్ స్కూల్

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మధ్యాహ్నభోజనం లేక విద్యార్థులు పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొంది. పాఠశాలలు ప్రారంభమై పదిరోజులు గడుస్తున్నప్పటికీ దాదాపుగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. కానీ కేవలం మోడల్ స్కూల్‌లో మాత్రం ఇప్పటికీ భోజనం అందివ్వకపోవడంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు పాఠశాలలో మధ్యాహ్నభోజనం ఏజెన్సీ నిర్వాహకులుగా పని చేసిన వారు ఈ సీజన్‌లో చేతులెత్తేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో ప్రతిరోజు ఇంటి నుంచి భోజనం తీసుకెళ్తున్నారు. పది రోజుల నుంచి పాఠశాలలో మధ్యాహ్నభోజన పథకం ఎందుకు అమలు చేయడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నప్పటికి ప్రయోజనం లేకుండా పోతుంది.

కొత్తవారికి అవకాశం దక్కేనా..!

మోడల్ పాఠశాలలో మధ్యాహ్నభోజన పథకం అమలు ప్రతీ విద్యా సంవత్సరం సమస్యలకు దారితీస్తుంది. పాఠశాలలో భోజన నిర్వాహకులు మొదట తమతో కాదని చేతులెత్తేసి తర్వాత కొన్ని రోజులకు తామే వంట చేస్తామని వస్తున్నారని, కొత్తవారికి అవకాశం ఇస్తే బాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. పాఠశాలలో కొత్త ఏజెన్సీని నియమించే వరకు భోజనం వడ్డించడం కుదరని ప్రిన్సిపాల్ పేర్కొంటున్నారు.

భోజనం అందించాల్సిందే..

పాఠశాలలు పున:ప్రారంభమైనప్పటి నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం పథకం తప్పకుండా అమలు చేయాల్సిందే. ఏజెన్సీల సమస్య ఉన్న చోట వెంటనే రెండు రోజుల్లో నియమించుకోవాల్సి ఉంటుంది. మోడల్ స్కూల్‌లో మధ్యాహ్నభోజన నిర్వాహకుల సమస్య ఉంటే కొత్తవారిని నియమించి భోజనం అందించాలని ప్రిన్సిపాల్‌కు సూచించడం జరిగింది. త్వరలో విద్యార్థులకు భోజనం అందించే ఏర్పాట్లు చేస్తాం.

–యోసెఫ్, ఎంఈవో, సదాశివనగర్

ఫుడ్‌లైసెన్స్ పేరిట ఘరానా మోసం

- అధికారులమంటూ దాబా యజమానుల వద్ద డబ్బులు వసూళ్లు

భిక్కనూరు : మీ దాబాహోటళ్లలో పారిశుధ్య లోపించిది కాబట్టి మీపై కేసులు పెడతాం అంటూ ఫుడ్ ఇన్‌స్పెక్టర్లమని చెప్పుకున్న గుర్తుతెలియని వ్యక్తుల చేతుల్లో దాబా యజమానులు మోసపోయిన ఘటన శనివారం భిక్కనూరు మండల పరిధిలో వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. భిక్కనూరు మండలంలోని దాబా యజమానులకు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి నాలుగురోజుల క్రితం ఫోన్లు వచ్చాయి. తాము ఆహార భద్రత అధికారులమని మీ హోటళ్లలో పారిశుధ్యం లోపించిందని వెంటనే మీ దాబాలను సీజ్ చేయాల్సి ఉంటుందని భయపెట్టారు. దీంతో దాబా యజమానులు ఆందోళన చెందగా మొదటితప్పుగా భావించి వదిలేస్తామని ఫుడ్‌లైసెన్స్ తీసుకుంటే సరిపోతుందని చెప్పారు. ఫుడ్‌లైసెన్స్‌ల కోసం దాబాయజమానులు తమ వివరాలు వారికి వాట్సప్‌లో పంపగా గుర్తుతెలియని వ్యక్తులు దరఖాస్తు చేసుకున్నట్లు మెసేజ్‌లు పంపారు. అనంతరం లైసెన్స్ కోసం రూ. 2,500 ఫోన్‌పే పంపాలని వారు డిమాండ్ చేయగా దాబా యజమానులుడబ్బులు పంపారు. ఇలా మండలంలోని 8 దాబాల యజమానులు సదరు వ్యక్తులకు రూ. 2,500 చొప్పున పంపినట్లు తెలుస్తోంది. అనంతరం లైసెన్స్‌లు తీసుకొస్తామని పేర్కొన్న సదరు వ్యక్తులు శుక్ర, శనివారాల్లో దాబాలకు రాకపోవడంతో వారికి ఫోన్‌లు చేయగా ఫోన్లు స్విచ్ఛాఫ్ వచ్చాయి. అలాగే వారు పంపిన మెసేజ్‌లు ఇన్‌కంప్లీట్ అని వస్తుండడంతో తాము మోసపోయామని వారు తెలుసుకుని ఆవేదనకు గురయ్యారు.

ఎవరూ డబ్బులు పంపవద్దు

ఫుడ్ లైసెన్స్ అవసరం ఉన్న వారు ఎవరైనా వ్యక్తిగత ఫోన్ నంబర్లకు డబ్బులు పంపవద్దు. భిక్కనూరు మండలంలో ఆహారశాఖ అధికారుల పేరిట ఫోన్‌పే ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్న విషయం మా దృష్టికి వచ్చింది. దాబా యజమానులను ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు మోసం చేశారు. తమశాఖ నుంచి ఎవరూ కూడా ఫోన్లు చేయలేదు. తాము నేరుగా వచ్చి లైసెన్స్‌లు అందజేస్తాం. ఇలాంటి వారితో అప్రమత్తంగా ఉండాలి. ఎవరికో ఫోన్లలో డబ్బులు పంపవద్దు.

– సునీత, ఫుడ్ ఇన్‌స్పెక్టర్

ఒకే పాఠశాలలో గురుశిష్యుల బోధన



మాచారెడ్డి : గురుశిష్యులు ఎక్కడైనా కలిస్తేనే చెప్పలేని ఆనందం కలుగుతుంది. అలాంటిది గురుశిష్యులు ఇద్దరూ ఉపాధ్యాయుల రూపంలో ఒకేచోట కలిస్తే వారి ఆనందాన్ని మాటల్లో చెప్పలేం.. మండలంలోని సోమారంపేట ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చిన ఆంగ్ల ఉపాధ్యాయుడు పోశెట్టి గతంలో నిజామాబాద్ గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో పార్ట్ టైం లెక్చరర్‌గా పనిచేశారు. ఆ సమయంలో కళాశాలలో డిగ్రీ చదివిన ఆయన విద్యార్థి సంధ్య ప్రస్తుతం పోశెట్టి పనిచేస్తున్న పాఠశాలకే పీఈటీగా వచ్చారు. ఈ సందర్భంగా గురుశిష్యులను ఉపాధ్యాయులు అభినందించారు.

రాజీవ్ పార్క్ పరిశీలన



కామారెడ్డి టౌన్ : మున్సిపల్ పరిధిలోని సిరిసిల్లా రోడ్‌లో రాజీవ్ పార్క్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ శనివారం పరిశీలించారు. పార్కుకు వచ్చే పర్యాటకులకు, పట్టణవాసులకు ఆహ్లాదకరంగా మంచి వాతావరణాన్ని అందించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. పార్కులోని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మురికి కాలువలో పసికందు మృతదేహం

- జిల్లా కేంద్రంలో కలకలం



ఖలీల్‌వాడి: రక్తపు తడి ఆరని ఓ పసికందు మృతదేహం మురికికాలువలో పడిఉన్న దృశ్యం కలిచివేసింది. ఆ తల్లి మోసపోయిందో.. లేక ఆడ పిల్ల పుట్టిందనే కారణమో? ప్రసవం అనంతరం ఆ శిశువు మృతి చెందిందో తెలియదు కానీ.. మురికి కాలువలో పసికందు మృతదేహం పడి ఉండడం కలకలం రేపింది. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ పక్కన గల్లీలో శనివారం ఉదయం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. శనివారం ఉదయం 6.30గంటలకు మురికికాలువలో పసికందు మృతదేహం కనిపించడంతో స్థానికులకు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న ఎస్సై ప్రవీణ్ పసికందు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఘటనకు సంబంధించి వివరాలు తెలిస్తే 87126 59839(ఎస్సై), 87126 59836 (సీఐ), 87126 59807(ఏసీపీ) సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

తప్పుడు చిరునామాతో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం!



సబ్ రిజిస్ట్రార్ వెబ్‌సైట్‌లో ఉన్న పాత అడ్రస్

కామారెడ్డి అర్బన్ : ఆన్‌లైన్ ద్వారానే అన్ని వ్యవహారాలు చేస్తున్న రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ తన కామారెడ్డి కార్యాలయం చిరునామాను మార్చలేకపోతుందని పలువురు అంటున్నారు. 2016 అక్టోబర్ 11న కామారెడ్డి జిల్లాగా ఏర్పాటు అయినప్పటికీ నేటికి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు కాలేదు. పైగా ప్రజలకు సౌకర్యంగా కామారెడ్డి కొత్త బస్టాండ్‌కు సమీపంలోని ఎన్జీవోస్ కాలనీలో అద్దె భవనంలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పట్టణానికి 4 కి.మీ దూరంలోని మున్సిపల్‌లో విలీనమైన పాతరాజంపేట జీపీ భవనంలోకి మార్చింది.

నాటి ప్రభుత్వంలో ప్రజలు నిరసనలు తెలిపినా ఫలితం లేకుండా పోయింది. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడుస్తున్న వ్యవస్థలో మార్పు రాలేదు. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ తన అధికారిక వెబ్‌సైట్‌లో అడ్రస్ మార్పు చేయలేదు. ఫోన్‌నంబర్ 229464 ఉండగా అది సైతం పనిచేయడం లేదు. దూరప్రాంతాల నుంచి కామారెడ్డికి రిజిస్ట్రేషన్ నిమిత్తం వచ్చే వారు ఇలా తప్పుడు అడ్రసుతో అనేక మంది ఇబ్బందులు పడుతున్నారు. వెబ్‌సైట్‌లో ప్రస్తుత పాతరాజంపేట అడ్రసు, ఫోన్ నంబర్ మార్పు చేయాలని కోరుతున్నారు.

నేలకొరిగిన స్పీడోమీటర్ బోర్డు


భిక్కనూరు మండలం అంతంపల్లి గ్రామశివారులో నేలకొరిగిన స్పీడో మీటర్

భిక్కనూరు : మండలంలోని అంతంపల్లి గ్రామశివారులో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన స్పీడో మీటర్ నేలకు ఒరిగింది. రెండేళ్ల క్రితం అప్పటి ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అంతంపల్లి గ్రామశివారులోని జాతీయ రహదారిపై హైదరాబాద్ వైపు నుంచి కామారెడ్డి వైపు వెళ్లే వాహనాదారులకు తాము నడుపుతున్న వాహనాలు ఎంతవేగంగా వెళ్తున్నాయో పెద్దపెద్ద అక్షరాలతో తెలియజేసే స్పీడో మీటర్ బోర్డును ఏర్పాటు చేశారు. వాహనదారులు తాము నడుపుతున్న వాహనంలో అధికవేగంతో వెళ్తుంటే ఈ బోర్డుపై ఉన్న అక్షరాలు వేగం తెల్పుతూ ఎరుపు రంగులో కన్పిస్తాయి. వేగం తక్కువగా ఉంటే వేగం తెలుపుతూ ఆకుపచ్చ రంగులో అక్షరాలు కన్పిస్తాయి. దీని చూసిన వాహనదారులు తాము తమ వేగాన్ని గమనించి వాహనాన్ని నడిపేవారు. దీని వల్ల ప్రమాదాలు తగ్గుతాయని అప్పటి ఎస్పీ ఈ బోర్డు సూచికను ఏర్పాటు చేయించారు. నాలుగు రోజులు క్రితం ఈ స్పీడో మీటర్ సూచిక నేలకు ఒరిగింది. వెంటనే పోలీసులు అధికారులు స్పందించి ఈ స్పీడో మీటర్ బోర్డును ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

వ్యవసాయ రంగానికి పెద్దపీట

- నేడు జిల్లావ్యాప్తంగా సంబరాలు చేసుకోవాలని పిలుపు
- కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి


మోపాల్‌లో పటాకులు కాలుస్తున్న నాయకులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేసేందుకు మంత్రి వర్గం ఆమోదం తెలుపడం హర్షణీయమని, తమది రైతు ప్రభుత్వమని కాంగ్రెస్ మరోసారి నిరూపించిందని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి అన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ ప్రకటనను హర్షిస్తూ మోపాల్ మండల కేంద్రంలో శనివారం పటాకులు కాల్చి రైతులు, నాయకులు సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ..వానాకాలం సీజన్‌లో పెట్టుబడికి ఇబ్బందులు కలుగకుండా ఆగస్టు 15వ తేదీలోగా రుణమాఫీ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. వరి సన్నరకాలకు కూడా రూ.500 బోనస్ ప్రకటించిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రుణమాఫీ పేరుతో పదేళ్లు రైతులను మోసం చేసిందని విమర్శించారు. ఏకకాలంలో రుణమాఫీ చేసినందుకు కిసాన్ కాంగ్రెస్ తరఫున, రైతాంగం తరఫున సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రుణ మాఫీ ప్రకటనను హర్షిస్తూ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్రకమిటీ సూచనల మేరకు ఆదివారం అన్ని మండలాల్లో పాలాభిషేకాలు, టపాకాయలు కాల్చి సంబురాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎల్లోల్ల సాయిరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గోర్కంటి లింగన్న, సొసైటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, రైతులు, నాయకులు గుడి ప్రవీణ్‌రెడ్డి, సాంబయ్య, సతీశ్, లక్ష్మీనర్సయ్య, అర్కల నారాయణ, గణపతి, చిన్నారెడ్డి, రాకేశ్, రాజేశ్, గడల భాస్కర్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



కామారెడ్డి క్రైం : యోగాతో మానసిక, శారీరక ప్రశాంతత లభిస్తుందని ఏఎస్పీ నరసింహారెడ్డి అన్నారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యంన్ని కాపాడడానికి యోగ తోడ్పడుతుందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయం మైదానంలో అధికారులు, సిబ్బందితో కలిసి యోగా చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ యాకుబ్ రెడ్డి , సీఐలు చంద్రశేఖర్ రెడ్డి, రామన్, మురళి, శేఖర్, కృష్ణ, ఎస్సైలు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో చికిత్సలు..

మాచారెడ్డి : మండలంలోని లక్ష్మీరావుల పల్లిలో అయోధ్య సేన ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని అశ్విని ఆస్పత్రి వైద్యులు బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అశ్విని ఆసుపత్రి చీఫ్ వైద్యుడు అభినయ్ 12మంది వైద్యులు పాల్గొన్నారు.

ముగ్గురు సీఐల బదిలీ

ఖలీల్‌వాడి: హైదరాబాద్‌లోని మల్టీజోన్-1లోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఐజీ రంగనాథ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏ సురేశ్‌ను మల్టీ జోన్-1 అటాచ్ నుంచి సీసీఎస్-1 బదిలీ చేస్తూ పూర్తి బాధ్యతలు అప్పగించారు. నిజామాబాద్ సీసీఎస్ - 1లో ఉన్న ఎం.రమేశ్‌ను ఐజీ ఆఫీస్‌కు అటాచ్ చేయగా, నిజామాబాద్‌సీసీఎస్ - 2లో పని చేస్తున్న వి.వీరప్రసాద్ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ టౌన్ సీఐగా బదిలీ అయ్యారు.

అంత్యక్రియలకు హాజరైన కోదండరాం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): నగరశివారులోని బోర్గాం(పి) గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు రతన్‌రావు తల్లి సరోజినీదేవి అంత్యక్రియలకు టీజేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ కోదండరాం హాజరయ్యారు. సరోజినీదేవి అనారోగ్యంతో గురువారం మృతి చెందగా, శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా రతన్‌రావు కుటుంబసభ్యులను కోదాండరాం పరామర్శించి ఓదార్చారు. అంత్యక్రియల్లో ఆయా పార్టీల నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జేఎల్‌ఎం రవి సస్పెండ్

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం: విద్యుత్‌శాఖలో విధులు నిర్వర్తిస్తున్న నాగారం సెక్షన్ ఏఈ సంతకం ఫోర్జరీపై విచారణ చేపట్టిన అధికారులు జేఎల్‌ఎం రవిని సస్పెండ్ చేశారు. సంతకం ఫోర్జరీపై 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఎస్ రవీందర్ ఆదేశాల మేరకు క్వాలిటీ కంట్రోల్ ఏడీఈ చక్రవర్తి విచారణ చేపట్టారు. మీటర్ మంజూరు ఫైల్‌పై ఏఈ సంతకాన్ని ఫోర్జరీ చేయడంతోపాటు జేఎల్‌ఎం సంతకం ఉన్నట్లు గుర్తించి నివేదికను ఎస్ఈకి అందించారు. నివేదిక ఆధారంగా జేఎల్‌ఎంను సస్పెండ్ చేస్తూ డీఈ శ్రీనివాస్‌రావు నిర్ణయం తీసుకున్నారు. ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారించేందుకు వరంగల్ ఎన్‌పీడీసీఎల్ నుంచి అధికారులు జిల్లాకు రానున్నారు. అసలు మీటర్ ఏఈ లాగిన్ నుంచి బయటకు రాకముందే టవర్‌కు ఏ విధంగా బిగించారు? ఆఫీసు నుంచి మీటరును ఎవరు ఇచ్చారు? అనే అంశాలపై స్పష్టతరానుంది. అయితే కేవలం జేఎల్‌ఎంను సస్పెండ్ చేసి చేతులు దులుపుకుంటారో.. నిక్కచ్చిగా విచారణ చేపట్టి నిజాలు బయటకు తెస్తారో అనే అంశంపై శాఖ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

ఉన్నత స్థానాల్లో నిలవాలి..



కామారెడ్డి క్రైం : కామారెడ్డి లోని హరిజనవాడలో ఉన్న బాలసదనంను అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.దీక్ష శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలికలతో మాట్లాడి అందుతున్న సౌకర్యాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాగా చదువుకుని ఉన్నతా స్థానాల్లో నిలవాలని సూచించారు. అనంతరం స్వయంగా పిల్లలకు పండ్లు, చాక్లెట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీసీ పీడీ బావయ్య, డీసీపీవో స్రవంతి, డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు మోహన్ రావు, పల్లె చిరంజీవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది ఖాన్ తదితరులున్నారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి


సంతకాలను సేకరిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కామారెడ్డి టౌన్ : ఇటీవల నిర్వహించిన నీటి పరీక్ష ప్రశ్నపత్రాల లీకేజీల కుంభకోణంపై పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకొని, ఆ పరీక్షను రద్దు చేయాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో సంతకాల సేకరణ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం స్పందించకుంటే బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీల ఇళ్లను ముట్టడి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ఎన్ ఆజాద్, ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఐరేని సందీప్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముదాం అరుణ్ తదితరులున్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


శ్రీకాంత్ (ఫైల్)

భిక్కనూరు: మెదక్ జిల్లా రామాయంపేట మండలం దామరచెరువు గ్రామం సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భిక్కనూరు మండలం మల్లుపల్లికి చెందిన యువకుడు మృతిచెందాడు. మల్లుపల్లి తండాకు చెందిన మాలోత్ శ్రీకాంత్ (23) తన సోదరి మౌనికతో కలిసి వ్యక్తిగత పనుల నిమిత్తం రామాయంపేటకు ద్విచక్రవాహనంపై వెళ్లాడు. పని పూర్తయిన తరువాత తిరిగి వస్తుండగా దామరచెరువు గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న జేసీబీ ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీకాంత్ అక్కడికక్కడే మృతి చెందగా, మౌనికకు తీవ్రగాయాలయ్యా యి. మౌనికను చికిత్స నిమిత్తం రామాయంపేట ఆస్పత్రికి తరలించారు. శ్రీకాంత్ మృతితో మల్లుపల్లి, మల్లుపల్లితండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఉపాధ్యాయురాలి ఆత్మహత్య


వీణ మృతదేహం

బీబీపేట: మానసిక స్థితి సరిగా లేకపోవడంతో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గాండ్ల వీణ అలియాస్ లాస్య (35) జనగామ గ్రామ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. ఎప్పటిలాగే శుక్రవారం విధులకు హాజరై ఇంటికి తిరిగి వచ్చింది. రాత్రి కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేసి పడుకున్న వీణ.. శుక్రవారం తెల్లవారు జామున ఇంటి వెనుకాల ఉన్న గదిలోకి వెళ్లి పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. తండ్రి రామచంద్రం గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందింది. గతంలో కూడా వీణ పలుమార్లు ఆత్మహత్యాయత్నం చేసిందని తండ్రి తెలిపారు. మృతురాలి తండ్రి రామచంద్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యానికి బానిసై మరొకరు..

కామారెడ్డి క్రైం: మద్యానికి బానిసైన వ్యక్తి జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట ఘటన జిల్లా కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని పెద్దమ్మగల్లీకి చెందిన దుబ్బాక బాలరాజు(40) మద్యానికి బానిసై తరచూ భార్యాపిల్లలతో గొడవపడేవాడు. శుక్రవారం భార్య లలిత అనారోగ్యంతో ప్రభుత్వ ఆస్పత్రిలో చేరగా, బాలరాజు ఇంటి వద్దే ఉన్నాడు. శనివారం ఉదయం లలిత తండ్రి ఇంటికి వెళ్లి చూడగా బాలరాజు ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

రెండిళ్లలో చోరీ

రెంజల్(బోధన్): మండలంలోని కళ్యాపూర్‌లో దుండగులు శుక్రవారం రాత్రి రెండిళ్లలో చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన బోర్గాం గంగాధర్‌కు చెందిన దుకాణంలో నుంచి రూ.15వేల నగదు, సాయమ్మ ఇంట్లో నుంచి రూ.5వేల నగదును ఎత్తుకెళ్లారు. బాధితులు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

నస్రుల్లాబాద్(బాన్సువాడ): వ్యవసాయ భూమి విషయంలో నెమ్లి గ్రామానికి చెందిన కల్లాలి సతీశ్, అంబం మోహన్ మధ్య గత కొంతకాలంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం పొలం వద్ద మళ్లీ గొడవ జరగడడంతో సతీశ్ వర్గానికి చెందిన వ్యక్తులపై మోహన్‌తోపాటు మరో ఆరుగురు దాడి తీవ్రంగా గాయపరిచినట్లు ఎస్సై లావణ్య తెలిపారు. ఏరియా ఆస్పత్రిలో చికిత్స అనంతరం బాధితులను నిజామాబాద్ ఆస్పత్రికి తరలించామన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా రెండేళ్లుగా తాము పోలీసు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

యువకుడి అదృశ్యం


హరికుమార్ (ఫైల్)

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రానికి చెందిన బత్తిని హరికుమార్(23) అదృశ్యమైనట్లు ఎస్సై కోనారెడ్డి శనివారం తెలిపారు. బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న హరికుమార్ ఈనెల 9వ తేదీన ఇంటి నుంచి బైక్‌పై బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. యువకుడి తండ్రి బత్తిని విఠల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.